అరకకు ఫుల్ డిమాండ్

- ఎకరాకు రూ. వెయ్యి
- రెండు నెలల పాటు ఎడ్లకు పనులు
- జోరందుకున్న పత్తి సాలులో కలుపుతీత పనులు



పత్తి పంటలో ఎడ్లతో గుంటుకను తోలుతున్న రైతు

మునిపల్లి(అందోల్): వివిధ రకాల పంటల సాగులో యంత్రాల వినియోగం ఎక్కువగా పెరిగింది. అయినప్పటికీ రైతులకు ఒక దశలో కాడెడ్లతో అవసరం ఏర్పడుతోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో అరక (గుంటుక)కు ఆదరణ తగ్గలేదు. పత్తిఏపుగా పెరగడంతో పత్తి సాలులో ఆరక తొలడం వల్ల గడ్డిని నివారించొచ్చు. పత్తి సాలులో అరక తోలడంతో పత్తి మొక్కల వరకు మట్టిపోయి కొన్ని రోజుల వరకు గడ్డి లేవకుండా ఉంటుంది. కాడెడ్ల రైతులు సొంత భూమి సాగు చేసుకోవడమే కాకుండా కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్నారు. ఎకరాకు వెయ్యి రూపాయలు తీసుకుని రోజుకు 4 ఎకరాల వరకు పత్తి సాలులో అరక తోలి డబ్బు సంపాదిస్తున్నారు.

ఎకరాకు వెయ్యి..

పత్తి పంట సాలులో ఎడ్లతో అరక తోలి ఎకరాకు వెయ్యి రూపాయల చొప్పున పనులు చేయిస్తున్నారు. కొంత మంది గత సంవత్సరం ఎకరాకు రూ. 8 వందల ఉంటే ఈ సంవత్సరం వెయ్యి రూపాయలతో పత్తి సాలులో అరకతో కలుపుతీత పనులు చేస్తున్నారు.

కనుమరుగవుతున్న కాడెద్దు..

గ్రామాల్లో కాడెద్దులు కనుమరుగవుతుండటంతో ఏ గ్రామంలో చూసినా పది పదిహేను మంది మాత్రమే కాడెద్దుల రైతుల కంటే ఎక్కువగా లేని పరిస్థితి నెలకొంది.

గుంటుకతో డబ్బు ఆదా



పత్తిసాలులో కలుపు తీయడానికి గుంటకతో ఎకరాకు రూ. వెయ్యి చొప్పున ఇచ్చి కలుపు నివారణకు పనులు చేయిస్తున్నా.. అదే ఎకరాకు కూలీలతో తీయిస్తే నాలుగు వేల రూపాయల వరకు ఖర్చు వస్తుంది. గుంటకతో భూమి చదును కావడమే కాకుండా పత్తి పంట మొక్కల సమీపంలో మట్టి ఎక్కువగా పడడంతో మొక్కలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

– శంకర్‌గౌడ్ రైతు, పిల్లోడి

వ్యవసాయానికి ఎడ్లు అవసరం



గతంలో కాడేడ్లతోనే రైతులు వ్యవసాయం చేసేవారు. మారుతున్న కాలానుగుణంగా యంత్రాలతో భూములు సాగు చేస్తుండడంతో కాడేడ్లకు ఎక్కువగా పని లేకుండా పోతోంది. చిన్నసన్న కారు రైతులకు కాడేడ్లతోనే ఎక్కువ పని ఉంటుంది.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

లబ్ధిదారులకు ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లికి గ్రామానికి చెందిన చాకలి అంజమ్మ అత్యవసర చికిత్స కోసం సీఎం సహాయనిధి కింద రూ. 2 లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే మాణిక్‌రావు బుధవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. అంజమ్మ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. సహాయం కోసం ఎమ్మెల్యేను కలసి వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు ఎల్‌ఓసీ మంజూరు చేసి అందజేశారు. కోహీర్‌కు చెందిన రాజశేఖర్‌కు రూ.1.50 లక్షల ఎల్‌ఓసీని అందజేశారు.

ఎల్‌ఓసీల అందజేత

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గ పరిధిలోని ఇస్నాపూర్‌కు చెందిన కంచర్ల శోభ, గుమ్మడిదల గ్రామానికి చెందిన మహేశ్‌యాదవ్‌లు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు కంచర్ల శోభకు రూ.5 లక్షల, మహేశ్‌యాదవ్‌కు రూ.2.50లక్షల ఎల్‌ఓసీలు మంజూరయ్యాయి. బుధవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలి

సబ్ కలెక్టర్ ఉమాహారతి



చెరువులు పరిశీలిస్తున్న ఉమాహారతి

నారాయణఖేడ్: రానున్న రెండు మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్ ఉమాహారతి అధికారులకు సూచించారు. నాగల్‌గిద్ద మండలంలోని పలు చిన్నచిన్న చెరువులను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఇటీవల గిరిజన గర్భిణీ మార్గమధ్యలో డెలివరీ అయిన మున్యానాయక్ తండాకు వెళ్లే రోడ్డు పరిస్థితిని సబ్ కలెక్టర్ కాలినడకన వెళ్లి పరిశీలించారు. రోడ్డు పరిస్థితిపై నివేదికను ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు. సబ్‌కలెక్టర్ వెంట తహసీల్దార్ శివకృష్ణ, ఎంపీడీఓ మహేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

బుగ్గరామన్న చెరువు పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న ఎస్‌ఐ రాజేశ్‌నాయక్

మునిపల్లి(అందోల్): బుగ్గరామన్న చెరువును బుదేరా ఎస్‌ఐ రాజేశ్ నాయక్ బుధవారం పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువు పరిస్థితిని తనిఖీ చేశారు. అలాగే, బుస్సారెడ్డిపల్లి గ్రామ శివారు సింగూర్ ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాజేశ్ నాయక్ మాట్లాడుతూ.. వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. చెరువులు, కుంటల వద్దకు పిల్లలు వెళ్లకుండా చూసుకోవాలన్నారు.

అంకితభావంతో చదవాలి



యూనిఫాం అందజేస్తున్న సుధాకర్‌రెడ్డి

మునిపల్లి(అందోల్): ప్రతి విద్యార్థి అంకితభావంతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం మండలంలోని మునిపల్లి హరిజన వాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంత్రి దామోదర రాజనర్సింహ పేరుపై విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, షూలు, స్పోర్ట్స్, యూనిఫాం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ భీంసింగ్, ప్రధానోపాధ్యాయులు అశోక్ కుమార్, కాంప్లెక్స్ స్థాయి ప్రధానోపాధ్యాయులు మాధవి, నాగభూషణం పాల్గొన్నారు.

కష్టపడి చదవాలి

కల్హేర్(నారాయణఖేడ్): విద్యార్థులు కష్టపడి చదవాలని కల్హేర్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి కోరారు. బుధవారం నిజాంపేట్ మండలం బాచేపల్లిలో గిరిజన బాలికల మినీ గురుకులంలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి తల్లిదండ్రుల ఆశయం నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌కు సబ్‌స్టేషన్లు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

పటాన్‌చెరు: ప్రజలకు మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు నూతన సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని సింఫని కాలనీలో రూ.6.50కోట్లు, 33/11 కేవీ ఇండోర్ సబ్‌స్టేషన్, తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పోచారంలో రూ.3.50కోట్లతో నిర్మించనున్న సబ్‌స్టేషన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలతో పాటు పల్లెలు పట్టణాలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వంతో చర్చించి నూతన సబ్‌స్టేషన్లు మంజూరు చేయించామన్నారు. ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమాల్లో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ట్రాన్స్‌కో డీఈ భాస్కరరావు, ఏడీ సంజయ్ ఉన్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

పటాన్‌చెరు: రాబోయే మూడు రోజులు పాటు భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సూచించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని స్థాయిల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ముంపు ప్రాంతాలలో పర్యటించి, ప్రజలకు తగు జాగ్రత్తలు సూచించాలన్నారు.

జీవితంలో సైన్స్‌కు ప్రత్యేక స్థానం

ఇస్రో శాస్త్రవేత్త హర్షవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఇస్రో శాస్త్రవేత్త హర్షవర్ధన్‌రెడ్డి

నారాయణఖేడ్: అంతరిక్ష విజ్ఞానంతోనే ప్రపంచ అభివృద్ధి సాధ్యమని ఇస్రో శాస్త్రవేత్త హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కల్హేర్ మండలం మార్డికి చెందిన ఆయన కేరళలోని తిరువనంతపురం ఇస్రో కేంద్రంలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. బుధవారం ఖేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 'అంతరిక్ష పరిశోధన- విద్యార్థుల కర్తవ్యం' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి విజ్ఞానంపై అవగాహన పెంచుకుని నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. మానవ జీవితంలో సైన్స్ ప్రత్యేక స్థానాన్ని సాధించిందన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి సలహాలు, సూచనలిచ్చారు. ప్రధానోపాధ్యాయులు అశోక్ గౌడ్, ఉపాధ్యాయులు రాజశేఖర్, వెంకట్‌రావు, రాజయ్య, చంద్రశేఖర్, లక్ష్మన్‌రావు, ధన్‌సింగ్ పాల్గొన్నారు.

సీఎస్‌ఆర్ నిధులు సేకరించాలి

కలెక్టర్ ప్రావీణ్య



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి జోన్: జిల్లాలోని పరిశ్రమల నుంచి 2025–26 ఆర్థిక సంవత్సరానికి సీఎస్‌ఆర్ నిధులు సేకరించాలని సంబంధిత కమిటీ సభ్యులను కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సీఎస్‌ఆర్ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా జిల్లాలోని పరిశ్రమలు ఎంత మేర నిధులు ఖర్చు చేశాయి, ఇంకా ఎన్ని నిధులు మిగిలాయి అనే వివరాలు తెలపాలన్నారు. సేకరించిన నిధులతో విద్య, వైద్య, ఆరోగ్యం వంటి వసతులకు కేటాయించాలన్నారు. నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలన్నారు. ఇప్పటివరకు ఇంకా ప్రారంభం కాని పనులు ప్రారంభించాలన్నారు. జిల్లాలో అవసరం ఉన్న పనులను గుర్తించి, కమిటీకి నివేదిక రూపంలో అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, పరిశ్రమల జనరల్ మేనేజర్ తుల్జానాయక్, సీపీఓ బాలశౌరి, డీఈఓ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ నాగనిర్మల, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ



అధికారులతో మాట్లాడుతున్న సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను సకాలంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యేలా చూడాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం నియోజకవర్గంలోని గృహనిర్మాణశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ దశలను బట్టి బిల్లులు ఖాతాల్లో వేయాలన్నారు. కొన్ని గ్రామాల్లో చిన్నచిన్న సమస్యలు, సాంకేతిక సమస్యలతో ఇళ్ల నిర్మాణాలకు ఆటంకాలు ఏర్పడుతున్నందున వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. గృహనిర్మాణశాఖ పీడీ చలపతిరావు, డీఈ సతీష్, మున్సిపల్ కమిషనరు జగ్జీవన్, ఏఈలు సత్యనారాయణ, వంశీ పాల్గొన్నారు. అలాగే, మున్సిపాలిటీ లోని చాంద్‌ఖాన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు.

పట్టణంలో తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సంగారెడ్డి: భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి పట్టణ శాఖ అధ్యక్షుడు దోమల విజయకుమార్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా తిరంగా యాత్రలో భాగంగా బుధవారం సంగారెడ్డి పట్టణంలోని జిల్లా కోర్టు వద్ద సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని శుభ్రపరచి పూలమాల వేసి నివాళులర్పించారు. విజయకుమార్ మాట్లాడుతూ.. దేశ స్వతంత్రం కోసం పోరాటం చేసిన సమరయోధులను వారి త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలు కోల్పోయిన మహనీయులను గుర్తు చేసుకుని నేటి యువత వారి మార్గదర్శనంలో ప్రయాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మందుల నాగరాజ్, కసినివాసు, ద్వారకా రవి, శివంగుల నాగరాజ్, ద్వారక శివ, అజయ్, రవీందర్, లింగమూర్తి, గోవింద్ బాబా చారి, కులకర్ణి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బస్తీబాటలో సంతకాల సేకరణ



సంతకాలను సేకరిస్తున్న సీపీఎం నాయకులు

జహీరాబాద్ టౌన్: బస్తీబాటలో భాగంగా సీపీఎం నాయకులు బుధవారం పట్టణంలోని వసంత్ విహార్‌లో పర్యటించారు. వర్షాలకు కాలనీ మునగడంతో ఆ ప్రాంతంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మహిపాల్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వసంత్ విహారం కాలనీ నీట మునుగుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేక ప్రజలు అవస్థలు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. అధికారులు కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని కోరారు. ఈ మేరకు సంతకాల సేకరణ చేపట్టి అధికారులకు పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తిరుపతి, సలీమోద్దీన్, నరేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని బాలవిహార్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం కార్పొరేటర్ బి.పుష్ప జీహెచ్‌ఎంసీ అధికారులతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోట్లాది రూపాయలతో పార్కును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన పనులకు త్వరలో ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. పార్కులో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్ పరికరాలను పరిశీలించారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకోస్తామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ సురేశ్, నాయకులు నగేష్, పీటర్, సామ్రాట్, రవి, నాగభూషణం, హనుమంత్, మల్లేశ్‌లు పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఎడతెరపి లేని వర్షాల కారణంగా గురువారం కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర పరిస్థితి అయితే మాత్రమే బయటకు రావాలని, వర్షాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పిస్టల్ మిస్‌ఫైర్‌పై విచారణ

జోగిపేట(అందోల్): జోగిపేట సీఐ కార్యాలయంలో సీఐ అనిల్‌కుమార్ చేతిలో మిస్‌ఫైర్ అయిన పిస్టల్ సంఘటన విషయంలో బుధవారం సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్ విచారణ జరిపారు. సంఘటన వివరాలను సీఐని అడిగి తెలుసుకున్నారు. పిస్టల్ పేలిన సమయంలో పగిలిపోయిన టైల్‌ను డీఎస్పీ పరిశీలించారు. విచారణ సమయంలో కార్యాలయం లోనికి ఎవరిని అనుమతించలేదు. మీడియాతో మాట్లేడేందుకు నిరాకరించారు. విచారణకు సంబంధించి చెప్పాలని మీడియా ప్రతినిధులు అడగడంతో ఆయన మాట్లాడారు. మిస్‌ఫైర్ కావడానికి గల కారణాలను తెలుసుకొని నివేదికను తయారు చేసి జిల్లా ఎస్పీకి అందజేస్తానని తెలిపారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై పోటీలు

నారాయణఖేడ్: ఖేడ్‌లోని నియోప్రగతి ఉన్నత పాఠశాలలో బుధవారం ఖేడ్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు 'ప్లాస్టిక్ నిర్మూలన' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొనగా మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. అనంతరం ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై శ్రీనివాస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పరిశ్రమల సహకారం అభినందనీయం

జిన్నారం (పటాన్‌చెరు): గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు పరిశ్రమలు అందిస్తున్న సహకారం అభినందనీయమని జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ అన్నారు. గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని వావిలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారాహి పరిశ్రమ ఆధ్వర్యంలో విద్యార్థులకు బూట్లు సాక్సులు పంపిణీ చేశారు.

పొరుతున్న వాగులు వంకలు



చిన్నచల్మెడ వాగు కల్వర్టుపై నుంచి పారుతున్న వరద

మునిపల్లి(అందోల్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. బుధవారం మండలంలోని తాటిపల్లి డబ్బవాగు, పెద్దలోడి సవుటాగు, చిన్నచల్మెడ, అంతారం గ్రామాల మధ్య ఉన్న చీలవాగులు కల్వర్టులపై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వాగుల నుంచి ప్రయాణించవద్దని గ్రామాల్లో చాటింపు చేయిస్తున్నారు.

బురదలో కూరుకుపోయిన లారీ



లారీని బయటకు తీస్తున్న జేసీబీ

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ సమీపంలో నారాయణఖేడ్–బీదర్ రోడ్డు పక్కన మంగళవారం రాత్రి ఓ లారీ బురదలో కూరుకుపోయింది. నారాయణఖేడ్ నుంచి న్యాల్‌కల్ వైపు బియ్యం లోడ్‌తో వస్తున్న లారీ గ్రామ సమీపంలోకి రాగానే రోడ్డు పక్కకు జారీ బురదలో కూరుకుపోయింది. బుధవారం సాయంత్రం దాని పక్కనే మరో లారీ బురదలో ఇరుక్కు పోవడంతో ట్రాఫిక్ జామ్ అయింది. జహీరాబాద్, బీదర్, నారాయణఖేడ్ వైపు వెళ్లే వాహనాలు చాలా సేపు నిలిచిపోయి వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బురదలో కూరుకుపోయిన వాహనాలను జేసీబీల సహాయంతో బయటకు తీశారు. దీంతో ట్రాఫిక్ క్లియర్ అయింది.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ రవీందర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భెల్ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మాదకద్రవ్యాల నివారణలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ మాట్లాడుతూ.. యువత దేశానికి వెన్నెముక అని.. యువత సన్మార్గంలో ముందుకు వెళ్లినప్పుడే దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. డ్రగ్స్ విక్రయించే వారిని గుర్తించి సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. వారి వివరాలను ప్రభుత్వ అధికారులు గోప్యంగా ఉంచుతారని తెలిపారు.

మత్తుకు బానిస కావొద్దు

నారాయణఖేడ్: విద్యార్థులు మత్తుకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఖేడ్ ఎస్‌ఐ విద్యాచరణ్ రెడ్డి సూచించారు. ఖేడ్ ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో బుధవారం మాదకద్రవ్యాల నిరోధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలను గురించి వివరించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

సంక్షిప్త వార్తలు

◆ పార్టీల ప్రతినిధులతో సమావేశం

నారాయణఖేడ్: ఖేడ్ తహసీల్ కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో తహసీల్దార్ షమీనాబేగం సమావేశమైయ్యారు. ఖేడ్ నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలను గురించి వివరించారు. పార్టీల నాయకులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

◆ విద్యుత్ స్తంభాలు తాకవద్దు

నారాయణఖేడ్: మరో రెండు, మూడురోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు విద్యుత్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఖేడ్ ట్రాన్స్‌కో ఏడీఈ నాగిరెడ్డి కోరారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ..వర్షాలు, గాలులు ఎక్కువగా ఉన్నప్పుడు, నీటి నిల్వ ఉన్నప్పుడు విద్యుత్ స్తంభాలను తాకడం ,తీగలకింద నిలబడటం వంటి చేయవద్దన్నారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడ్డా, స్తంభాలు విరిగి పడ్డాసంబంధిత లైన్‌మెన్‌కు లేదా సబ్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

◆ సాగులో సూచనలు పాటించాలి

రాయికోడ్(అందోల్): పంటల సాగులో రైతులు తమ సలహాలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి సారిక పేర్కొన్నారు. రాయికోడ్ రైతు వేదికలో బుధవారం ఆయా గ్రామాల రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు తమ పంట పొలాల్లో వర్షం నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. పత్తి, పెసర, మినుము, కంది, సోయాబీన్ తదితర పంట చేలల్లో క్రిమిసంహారకాలు, ఎరువుల వినియోగంలో విధిగా వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించి పంటలను రక్షించుకోవాలన్నారు. వరద పంట పొలాల్లో నిల్వకుండా బయటకు పంపడంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది నిఖిలేష్, భావన, రమేష్, రైతులు ఉన్నారు.

◆ రోడ్డుకు మరమ్మతులు చేయించండి



జహీరాబాద్ టౌన్: రోడ్డు పూర్తిగా ధ్వంసమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రోడ్డుకు మరమ్మతులు చేయాలని బూచినెల్లి గ్రామస్తులు కలెక్టర్ ప్రావీణ్యను కోరారు. బూచినెల్లి నుంచి కర్నాటక రాష్ట్రంలోని ఘనాపూర్‌కు వెళ్లేదారిలో ఉన్న వంతెన పైనుంచి భారీగా వరద ప్రవహిస్తోంది.. బుధవారం ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి బూచినెల్లి గ్రామాన్ని సందర్శించారు. నారింజ వాగుపై నిర్మించిన బ్రిడ్జిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కలెక్టర్‌ను కలిసి జాతీయ రహదారి నుంచి గ్రామం వరకు ఉన్న పూర్తిగా దెబ్బతిన్న నరకం చూస్తున్నామని తెలిపారు. అధికారులతో వివరాలు తెలుసుకుని రోడ్డుకు మరమ్మతులు పూర్తి చేయిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

◆ వినాయక మండప నిర్మాణానికి కర్రపూజ

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని నాగులకట్ట మందిరం వద్ద మహారుద్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వినాయకచవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండప నిర్మాణానికి బుధవారం కర్రపూజ చేశారు. వినాయక మండప నిర్మాణ పనులకు మాజీ కౌన్సిలర్ మాణిక్‌రావు కర్రపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మహారుద్ర యూత్ సభ్యులు మనోహర్, నరేష్, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ వీరభద్రుడికి ప్రత్యేక పూజలు

జిన్నారం(పటాన్‌చెరు): బొంతపల్లి వీరభద్రస్వామిని నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుమ్మడిదల మున్సిపాలిటీ వీరన్నగూడెం పరిధిలోని వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, బిల్వార్చన వంటి ప్రత్యేక పూజలు చేశారు. వీరభద్రుడి ఆశీసులు ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఆయనను ఘనంగా సన్మానించారు.